మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 105 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad



## నేపాల్ నూతన ప్రధానిగా కె.పి.శర్మ ఓలి



కాఠ్మండూ (ప్రజా మంటలు): నేపాల్ నూతన ప్రధానిగా కె.పి.శర్మ ఓలి నియమితులయ్యారు. అంతకుముందు ప్రధానిగా ఉన్న పుష్పకమల్ దహల్ అలియాస్ ప్రచండ(69) నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం ఇటీవల కుప్పకూలిన విషయం తెలిసిందే. పార్లమెంటులోని ప్రతినిధుల సభలో శుక్రవారం నిర్వహించిన విశ్వాస పరీక్షలో ప్రచండ ఓడిపోయారు. ఈ క్రమంలోనే కె.పి.శర్మ ఓలి (72) నేతృత్వంలోని సీపీఎన్-యూఎంఎల్, మరో మాజీ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా సారథ్యంలోని నేపాలీ కాంగ్రెస్(ఎన్‌సీ)ల కూటమి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పటికే 165 మంది సభ్యుల (సీపీఎన్-యూఎంఎల్- 77, ఎన్‌సీ- 88) సంతకాలను ఓలి సమర్పించారు. 275 సీట్లున్న సభలో విశ్వాస తీర్మానం నెగ్గడానికి 138 ఓట్లు కావాల్సి ఉండగా, ప్రచండకు అనుకూలంగా 63 ఓట్లు మాత్రమే వచ్చాయి. 194 ఓట్లు వ్యతిరేకంగా పడ్డాయి. దీంతో ప్రచండ ప్రధాని పదవి నుంచి వైదొలిగారు. కొత్త ప్రధానిగా ఓలిని దేశ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ నియమించారు. ఓలితో పాటు కొత్త మంత్రివర్గం సోమవారం ప్రమాణ స్వీకారం చేయనుంది. కొన్ని రోజుల క్రితమే ఓలి, దేవ్‌బాల మధ్య అధికారాన్ని పంచుకోవడంపై ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం తొలి 18 నెలలు ఓలి ప్రధానిగా ఉంటారు. ఆయన ఇదివరకు రెండుసార్లు ప్రధానిగా పనిచేశారు. ఆ తర్వాత పార్లమెంటు గడువు ముగిసేవరకూ దేవ్‌బా ప్రధానిగా కొనసాగుతారు.

# రంగారెడ్డి జిల్లాకు మహర్దశ

## రాబోయే రోజుల్లో న్యూయార్క్‌ను తలదన్నేలా రంగారెడ్డిని తీర్చిదిద్దుతాం

- ఎకరం భూమి రూ.100 కోట్లు పలుకుతోంది
- రీజినల్ రింగ్ రోడ్డు వల్ల ఇక్కడి భూములు బంగారం కానున్నాయి
- కుల వృత్తుల వారు తమ పిల్లలను బాగా చదివించండి :సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, (ప్రజా మంటలు): రాబోయే రోజుల్లో రంగారెడ్డి జిల్లాకు మహర్దశ రాబోతుందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఎక్కడా లేని విధంగా కేవలం ఒక్క రంగారెడ్డిలోని ఎకరం భూమి రూ.100 కోట్లు పలుకుతుందని అన్నారు. ఐటీ కంపెనీలు వచ్చాక భూములకు విలువ పెరిగిందని సీఎం స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన కాటమయ్య రక్ష కిట్ల పంపిణీ కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఒకప్పుడు భూములకు విలువలేదని, కానీ ఐటీ కంపెనీలు వచ్చాక భూముల విలువ అమాంతం పెరిగిపోయిందని సీఎం రేవంత్ రెడ్డి ఆనందించారు. ఎక్కడా లేనివిధంగా రూ.100 కోట్లు పలికిన భూమి రంగారెడ్డి జిల్లాలోనే ఉందని చెప్పారు. 360 కిలోమీటర్ల మేర రీజినల్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు వల్ల రంగారెడ్డి జిల్లా భూములు బంగారం అవుతాయని హర్షం వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన కాటమయ్య రక్ష కిట్ల పథకం పంపిణీ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగారెడ్డి అభివృద్ధి గురించి కీలకవ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, తొందరలో హయత్‌నగర్‌కు మెట్రో రాబోతుందని వెల్లడించారు. మెట్రో రైలు విస్తరణ సంబంధించి అన్ని ప్రణాళికలు పూర్తి అయ్యాయని చెప్పారు. సైబరాబాద్‌ను న్యూయార్క్‌తో

## రాగల ఐదురోజులు అతిభారీ వర్షాలు

- తెలంగాణలో ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసిన ఐఎండీ..



హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో కోస్తాంధ్ర ప్రదేశ్‌లో పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో నిన్న ఏర్పడిన ఆవర్తనం గంగా పశ్చిమ బెంగాల్ మీదుగా ఏర్పడిన ఆవర్తనంలో కలిసిపోయిందని వాతావరణశాఖ పేర్కొంది. ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, నల్గొండ, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు ఛాన్స్ ఉందని

## ఏడు నెలల్లో ఎన్ని ఉద్యోగాలిచ్చారో చెప్పండి - కేటీఆర్



హైదరాబాద్, (ప్రజా మంటలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సత్తా ఉంటే.. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే శ్వేతపత్రం ప్రచురించమని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చాక ఎన్ని నోటిఫికేషన్లు ఇచ్చారు? ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారు? మీరిచ్చిన జాబ్ క్యాలెండర్‌లో ఎన్ని మాటలు నిలబెట్టుకున్నారో స్పష్టంగా ఒక శ్వేతపత్రం ప్రకటించాలని అన్నారు. మోతీలాల్ అనే వ్యక్తి ఉద్యోగాలకే రాస్తలేడు.. ఆయన కూడా నిరాహార దీక్ష చేస్తున్నాడని అవమానించేలా గ్రూప్‌కు ప్రిపేర్ అవుతున్న వ్యక్తిని అవమానించేలా ముఖ్యమంత్రి మాట్లాడారని కేటీఆర్ అన్నారు. ఏ కోచింగ్ సెంటర్లను అయితే ఆలంబనగా చేసుకుని నువ్వు, మీ రాహుల్‌గాంధీ వెళ్లి రెండు ఉద్యోగాలు సంపాదించుకున్నారో.. ఆ కోచింగ్ సెంటర్ నిర్వాహకులను అవమానించేలా వందల కోట్లు సంపాదించుకునేందుకు పరీక్షలు వాయిదా వేయాలని మాట్లాడటం కరెక్ట్ కాదని హితవు పలికారు. అందుకే తెలంగాణ యువత భగ్గుమంటున్నదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అయితే రెండు లక్షల ఉద్యోగాలను ఇస్తుందని

మిగతా 2లో..

## మరిన్ని ఖాళీలతో మరో డీఎస్సీ



- ఆరువేల పోస్టులతో నిర్వహిస్తాం
- పరీక్షల వాయిదా కోరుతూ ఆందోళనలు వద్దు
- మూడు నెలల్లో 30 వేల ఉద్యోగాలిచ్చాం
- మిగిలిన ఉద్యోగాలు ఇచ్చేందుకూ కట్టుబడి ఉన్నాం
- ఈనెల 11 నుంచి డీఎస్సీ హాల్ టికెట్లు: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, (ప్రజా మంటలు): త్వరలో ఆరు వేల పోస్టులతో మరో డీఎస్సీ ఉంటుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. ఇదే చివరి డీఎస్సీ కాదని అన్నారు. మూడు నెలల్లో 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకొచ్చారు. గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో ఆయన ఈ ప్రకటన చేశారు. తెలంగాణలో ఇదే చివరి డీఎస్సీ కాదు, మరిన్ని తీస్తామని త్వరలో ఐదు వేల నుంచి ఆరు వేల పోస్టులతో మరో డీఎస్సీ ఉంటుందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. రాష్ట్రం తెచ్చుకున్నదే యువతకు ఉద్యోగాల కోసమని తెలిపారు. మూడు నెలల్లో 30 వేల మందికి నియామకపత్రాలు ఇచ్చామని అన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. మూడు నెలల్లో 30 వేల మందికి నియామకపత్రాలు ఇచ్చామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మిగిలిన ఉద్యోగాలు ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. 11 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చామని వివరించారు. అధికారంలోకి రాగానే 16 వేల ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నట్లు గుర్తించామని వెల్లడించారు. 19,717న మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు, 34 వేల మందిని బదిలీలు చేసినట్లు తెలిపారు. ఈనెల 11 నుంచి డీఎస్సీ హాల్ టికెట్లు అందుబాటులోకి ఉంచామని, ఇప్పటికే 2,00,500 మంది హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. డీఎస్సీని పకడ్బందీగా నిర్వహిస్తామని అన్నారు. త్వరలో పోస్టుల సంఖ్యతో నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. డీఎస్సీకి అభ్యర్థులు కొన్ని నెలలుగా సిద్ధం అవుతున్నారని, అందుకే జులై 18 నుంచి ఆగస్టు 5 వరకు పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పదేళ్లలో ఎన్నడూ గ్రూప్-1 నిర్వహించలేదన్న విషయాన్ని డిప్యూటీ సీఎం భట్టి గుర్తు చేశారు. విద్యావ్యవస్థ బలోపేతం, పేద విద్యార్థులకు మంచి విద్యనందించాలని


మిగతా 2లో..

## చర్చల నుంచి వైదొలుగుతున్నాం

- ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ప్రకటించిన హమాస్..
- గాజాలో శాంతియత్నాలకు విఘాతం!

గాజాస్ట్రిప్ (ప్రజా మంటలు): గాజా లో శాంతి యత్నాలకు విఘాతం కలిగింది. ఇజ్రాయెల్‌తో సాగుతోన్న కాల్పుల విరమణ చర్చల నుంచి వైదొలుగుతున్నట్లు హమాస్ ప్రకటించింది. చర్చల విషయంలో ఇజ్రాయెల్ ఉదాసీన వైఖరి, గాజాలో నిరాయుధ పౌరుల ఊచకోత ..తదితర కారణాలతో వాటిని నిలిపివేయాలని హమాస్ రాజకీయ విభాగం చీఫ్ ఇస్మాయిలీ హనియా నిర్ణయం తీసుకున్నారని, అంతర్జాతీయ మధ్యవర్తులకు ఇదే విషయాన్ని స్పష్టం చేశారని గ్రూప్ సీనియర్ నేత ఓ వార్తాసంస్థకు వెల్లడించారు. మరోవైపు హమాస్ మిలిటరీ చీఫ్ మహమ్మద్ డెయిఫ్ సురక్షితంగా ఉన్నట్లు తెలిపారు. అమెరికా మద్దతిస్తున్న మూడు దశల కాల్పుల విరమణ ఒప్పందంపై ఇరుపక్షాల నడుమ కొంతకాలంగా చర్చలు సాగాయి. గాజాలో యుద్ధాన్ని ఇజ్రాయెల్ శాశ్వతంగా ముగిస్తేనే కాల్పుల విరమణకు అంగీకరిస్తామని చెప్పిన హమాస్.. ఇటీవల ఆ కీలక డిమాండ్‌పై వెనక్కి తగ్గింది. దీంతో గాజాలో కాల్పుల విరమణకు మార్గం సుగమమైనట్లు కనిపించిన వేళ.. తాజా పరిణామం చోటుచేసుకుంది. మరోవైపు.. డెయిఫ్ లక్ష్యంగా ఖాన్ యూనిస్‌లో టెల్‌అవీవ్ జరిపిన దాడుల్లో 90 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే.. డెయిఫ్ సురక్షితంగా ఉన్నారని, గ్రూప్ సైనిక కార్యకలాపాలను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారని ఓ హమాస్ నేత వెల్లడించారు.

## ప్రజా నాడి




## ట్రంప్‌పై హత్యాయత్నంపై నివ్వెరపోయిన ప్రపంచ వేత్తలు

- ప్రజాస్వామ్యంలో ఈ తరహా రాజకీయాలు మంచివి కావని పలువురి వ్యాఖ్య
- ఘటనను తీవ్రంగా ఖండించిన బైడెన్, ప్రధాని మోదీ

పెన్సిల్వేనియా (ప్రజా మంటలు): అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ర్యాలీలో కాల్పులు చోటుచేసుకున్నాయి. పెన్సిల్వేనియాలో ట్రంప్‌పై కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో గాయపడిన ట్రంప్‌ని ఆస్పత్రికి తరలించారు. దుండగుడి కాల్పుల్లో ట్రంప్ చెవికి గాయమైంది. ఈ కాల్పుల్లో ర్యాలీకి హాజరైన ఓ వ్యక్తి మరణించినట్లు తెలుస్తోంది. కాల్పులు జరిపిన దుండగుడిని భద్రతా బలగాలు హతమార్చినట్లు సమాచారం. ట్రంప్ ప్రచారం నిర్వహిస్తుండగా దుండగుడు కాల్పులు జరిపాడు. దీంతో ఆయన ఒక్కసారిగా స్టేజిపై కింద పడిపోయారు. భద్రతా సిబ్బంది వెంటనే ట్రంప్ చుట్టూ రక్షణగా చేరారు. మాజీ అధ్యక్షుడిని వేదికపై నుంచి దించి ఆస్పత్రికి తరలించారు. ట్రంప్ ప్రస్తుతం సురక్షితంగానే ఉన్నట్లు భద్రతా అధికారులు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. ట్రంప్‌పై దాడిని అధ్యక్షుడు బైడెన్ తీవ్రంగా ఖండించారు. కాల్పుల ఘటనపై భద్రతా ఏజెన్సీల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అమెరికాలో హింసకు చోటు లేదని పేర్కొన్నారు. ట్రంప్‌పై కాల్పుల ఘటనను అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ ఖండించారు. అమెరికాలో హింసకు తావు లేదన్నారు. కాల్పుల్లో గాయపడిన ట్రంప్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఘటనలో తక్షణం స్పందించిన యూఎస్ సీక్రెట్ సర్వీస్, లోకల్ అథారిటీస్‌ను ఆమె అభినందించారు. కాగా అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్‌పై హత్యాయత్నం యావత్ ప్రపంచాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఆ దేశ రాజకీయ చరిత్రలో



మొదటి పేజీ తరువాయి

# మరిన్ని ఖాళీలతో మరో డీఎస్సీ




డీఎస్సీ ప్రకటించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. గత ప్రభుత్వం నిరుద్యోగులను గాలికి వదిలేసిందని విమర్శించారు. పదేళ్లు డీఎస్సీని గత ప్రభుత్వం నిర్వహించలేదన్నారు. ఎన్నికలకు ముందు నోటిఫికేషన్ విడుదల చేసి ఓట్ల కోసం తాపత్రయపడ్డారని ఆరోపించారు. ఐదు వేలకు నోటిఫికేషన్ ఇచ్చి నిర్వహించనందుకు తమ ప్రభుత్వం రాగానే 11 వేలకు పైగా పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చామని గుర్తు చేశారు.'గ్రూప్-2ను ఇప్పటికే మూడు సార్లు వాయిదా వేశారు. తమ ప్రభుత్వం నిర్వహించడానికి కృషి చేస్తోంది. పరీక్షలు అన్నిసార్లు వాయిదా వేయడం సరికాదు. త్వరితగతిన ఉద్యోగాలు ఇవ్వడమే మా ప్రభుత్వ లక్ష్యం. హాస్టల్ వెల్ఫేర్‌కి సంబంధించి 581 ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహించాం. ఇదే చివరి డీఎస్సీ కాదు మరిన్ని తీస్తాం. గత ప్రభుత్వంలో పేపర్ లీకేజీలతో నిరుద్యోగ యువకులు నష్టపోయిన విషయాన్ని గుర్తించాం. గ్రూప్-3 కూడా నిర్వహించలేకపోతే మళ్లీ మేం షెడ్యూల్ చేశాం. ఇవన్నీ నిరుద్యోగులకు నష్టం కలుగొద్దన్నదే మా ప్రయత్నం.' అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. 'ఇదే చివరి డీఎస్సీ కాదు మరిన్ని తీస్తాం. ఐదు వేల నుంచి ఆరు వేల పోస్టులతో మరో డీఎస్సీ త్వరలో ఉంటుంది. రాష్ట్రం తెచ్చుకున్నదే యువతకు ఉద్యోగాల కోసం. మూడు నెలల్లో 30 వేల మందికి నియామకపత్రాలు ఇచ్చాం. మిగిలిన ఉద్యోగాలు ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నాం. 11 వేల ఉపాధ్యాయు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చాం. అధికారంలోకి రాగానే 16 వేల ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నట్లు గుర్తించాం. జులై 18 నుంచి ఆగస్టు 5 వరకు పరీక్షలు నిర్వహిస్తున్నాం.

# ట్రంప్‌పై హత్యాయత్నంపై నివ్వెరపోయిన ప్రపంచ వేత్తలు

ఇదో మచ్చగా మిగిలిపోనుంది. ఈ దుశ్చర్యకు పాల్పడిన వ్యక్తిని ఎఫ్‌బీఐ తాజాగా గుర్తించింది. అతణ్ని 20 ఏళ్ల థామస్ మాథ్యూ క్రూక్స్‌గా ధ్రువీకరించింది. పెన్సిల్వేనియాలోని బెతెల్ పార్క్‌కు చెందిన వ్యక్తిగా తెలిపింది. ప్రభుత్వ ఓటింగ్ రికార్డుల ప్రకారం.. అతడు రిపబ్లికన్ పార్టీ మద్దతుదారుగా నమోదు చేసుకున్నాడు. కానీ, అతడు 2021 సంవత్సరంలో 15 డాలర్లను డెమొక్రాట్లకు అనుబంధంగా పనిచేసే ప్రోగ్రెసివ్ టర్న్‌ఔట్ ప్రాజెక్టుకు విరాళంగా ఇచ్చాడు. ప్రస్తుతం క్రూక్స్ ఇంటి వద్ద భారీగా పోలీసులు మోహరించారు. ఆ మార్గంలోకి ఎవరినీ రానీయడంలేదు. దుండగుడు క్రూక్స్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ముందుగానే సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. కొన్ని మీడియా సంస్థలు సైతం అనుమానితుడిగా పేర్కొంటూ అతడి ఫొటోలను ముందే ప్రసారం చేశాయి. మరోవైపు కాల్పులకు ముందు అతడు రికార్డు చేసినదిగా పేర్కొంటున్న ఓ వీడియో కూడా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లుకొడుతోంది. అందులో 'రిపబ్లికన్ పార్టీని, ట్రంప్‌ను నేను ద్వేషిస్తున్నా'నని అతడు చెబుతున్నట్లుగా ఉంది.

**డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నం.. రష్యా స్పందన ఇదే!**

మాస్కో: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన నేపథ్యంలో రష్యా స్పందించింది. అమెరికా చట్ట విరుద్ధమైన విధానాలను ప్రేరేపించిన ఫలితమే ఈ దాడి అని విమర్శించింది.విద్వేషాలను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దని అమెరికాకు హితవు పలికింది. ఉక్రెయిన్‌కు సాయాన్ని నిలిపివేసి.. ఆ మొత్తంతో అమెరికాలో శాంతిభద్రతలను బలోపేతం చేసుకోవచ్చని రష్యా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మారియా జఖరోవా తెలిపారు. అధికారంలోకి వస్తే ఉక్రెయిన్‌కు మద్దతు ఉపసంహరిస్తానని ట్రంప్ పరోక్షంగా చెప్పడంతో ఆయనపై హత్యాయత్నం జరిగిందని ఆరోపించారు. ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు జఖరోవా తెలిపారు. ఉక్రెయిన్‌కు ఆయుధ సహకారం చేసే నాయకులను అమెరికా ప్రజలు ఎన్నుకున్నారని విమర్శించారు. ఈ తరహా చర్యలే.. రష్యా అధ్యక్షుడిపైనా దాడులకు ప్రేరేపించాయన్నారు. కీవ్‌కు సాయం చేసే బదులు.. ఆ మొత్తాన్ని అమెరికా పోలీస్ వ్యవస్థ బలోపేతానికి వినియోగించుకోవచ్చని సూచించారు. తద్వారా దేశంలో శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని చెప్పారు.ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్ నేతృత్వంలో.. ఉక్రెయిన్‌కు అమెరికా అండగా నిలుస్తోంది. రష్యాతో యుద్ధానికి అత్యాధునిక ఆయుధాలను సమకూరుస్తోంది. అయితే, నవంబర్‌లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో ఒకవేళ ట్రంప్ విజయం సాధిస్తే.. ఉక్రెయిన్‌కు సాయం కొనసాగిస్తారా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు తాను అధ్యక్షుడిగా ఎన్నికైతే రష్యా-ఉక్రెయిన్ సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తానని ట్రంప్ సంకేతాలిచ్చారు. దీంతో కీవ్ భయపడుతోంది. ఆయుధ సహకారాన్ని నిలిపివేసి.. తమను బలహీనంగా మార్చి.. రష్యాతో చర్చలకు ఒత్తిడి తీసుకొస్తారేమోనని అనుమానిస్తోంది. మరోవైపు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా ట్రంప్ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకున్నట్లు వెల్లడించారు.

# అధికారులతో మేడిబావి కాలనీ వాసుల ఇంటరాక్ట్..

**- అధికారుల దృష్టికి సమస్యలు**




సికింద్రాబాద్, జులై 14 (ప్రజా మంటలు) : సికింద్రాబాద్ మేడిబావి కాలనీ హౌజ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఆయా శాఖల అధికారులతో సమావేశమయ్యారు. చిలకలగూడ ఏసీపీ జైపాల్ రెడ్డి, సీఐ అనుదీప్, వాటర్ వర్క్స్ ఏఈ అమిత్, ఎలక్ట్రిసిటీ అధికారులు ఈసందర్భంగా స్థానిక ప్రజలతో ఇంటరాక్ట్ అయి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మేడిబావి ఆర్య సమాజ్ ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో ప్రజలు చెప్పిన సమస్యలను ఆలకించిన ఆయా శాఖల అధికారులు వాటిని త్వరగా పరిష్కరిస్తామని హామినిచ్చారు. కాలనీలో పోకిరిల బెడద అధికంగా ఉందని, గంజాయి బ్యాచ్ లను అరికట్టాలని పలువురు ఏసీపీ జైపాల్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. పూర్తి స్థాయిలో సీసీ కెమారాలను అమర్చుకుంటే, వాటిని పోలీస్ స్టేషన్ కమాండ్ సెంటర్ కు అనుసంధానం చేసి, అసాంఘిక కార్యకలాపాలను అరికడుతామని ఏసీపీ హామినిచ్చారు. కొన్ని ఏరియాల్లో వాటర్ తక్కువ ప్రెషర్ వస్తుందని, అలాగే కలుషిత వాటర్ వస్తుందని పలువురు వాటర్ వర్క్స్ అధికారులకు వివరించారు. ఉచిత కరెంట్ స్కీం తమకు వర్తించడం లేదని పలువురు ఎలక్ట్రిసిటీ అధికారుల దృష్టికి తెచ్చారు. సమావేశంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ కామిశెట్టి రవికుమార్, జనరల్ సెక్రటరీ ఆదూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు లక్ష్మారెడ్డి, బోనగిరి శ్రీను, కొండల్, యాదగిరి, యశ్వంత్, ఆర్య సమాజ్ ప్రెసిడెంట్ ఎం.ఆర్.రవీందర్, దాదాపు 200 మంది కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఏడు నెలల్లో ఎన్ని ఉద్యోగాలిచ్చారో చెప్పండి: కేటీఆర్

ఎన్నో ఆశలతో ఏ యువత అయితే మమ్మల్ని దించి మిమ్మల్ని గద్దెనెక్కించిందో.. అదే యువత నిన్ను ప్రశ్నిస్తుందని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి ఏడు నెలలు పూర్తయ్యి ఎనిమిదో నెలలలోకి అడుగుపెట్టిందని కేటీఆర్ అన్నారు. ఈ 8 నెలల్లో ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదని.. మిగతా 4 నెలల్లో రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు, ఉద్యోగాలు ఎట్ల ఇస్తుందని కేటీఆర్ ప్రశ్నించారు. ఇచ్చిన మాటను నెలబెట్టుకునేదాకా మిమ్మల్ని వదిలిపెట్టమని స్పష్టం చేశారు. శాసనసభలో.. ప్రజా క్షేత్రంలో నిలదీస్తామని తెలిపారు. ఏ నిరుద్యోగుల్నైతే మోసం చేశావో.. వాళ్లకు అండగా ఉంటామని పేర్కొన్నారు. ఇది రెండు రాజకీయ ఉద్యోగాల సంబంధించిన పంచాయతీ కాదు.. లక్షలాది మంది యువతకు వారి భవిష్యత్తుకు సంబంధించిన అంశమని కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి ఇకనైనా భేషజాలకు.. ఫాల్స్ ప్రెస్టేజ్‌కు, ఇగోకు పోకుండా.. అహంకారం తగ్గించుకుని, కండాకావరంతో మాట్లాడే విధానాన్ని తగ్గించుకోవాలని అన్నారు. నిరుద్యోగులకు క్షమాపణ చెప్పి.. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. "గ్రూప్-2, గ్రూప్-3లో పోస్టుల సంఖ్య పెంచాలి. మీరు చెప్పినట్లుగా పోస్టులు పెంచి మెగా డీఎస్సీ ఇచ్చి మాట నిలబెట్టుకోవాలి. మీ పార్టీ తరఫున అసెంబ్లీలో భట్టి విక్రమార్క డిమాండ్ చేసినట్లుగా గ్రూప్-1లో ఇంటర్వ్యూలకు 1: 100 పిలవాలి. నిన్న మాట్లాడిన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పాలి" అని డిమాండ్ చేశారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇవ్వడంపై అసెంబ్లీలో చర్చకు పట్టుబడతామని తెలిపారు. ఉద్యోగాలకు సంబంధించి ప్రభుత్వం శ్వేతపత్రం ప్రచురించాలని డిమాండ్ చేస్తామన్నారు. ఒప్పుకోకపోతే వాయిదా తీర్మానం ఇచ్చయినా సరే సభను స్తంభింపజేయడానికి కూడా వెనుకాడమని స్పష్టం చేశారు. నిరుద్యోగుల కోసం బక్క జాడ్సన్ దీక్ష చేస్తుంటే.. ఏ ఉద్యోగం కోసం దీక్ష చేస్తున్నారని రేవంత్ రెడ్డి ప్రశ్నిస్తున్నారని కేటీఆర్ అన్నారు. 2023లో గాంధీ భవన్‌లో రేవంత్ రెడ్డి కూడా దీక్ష చేశాడని, ఏ ఉద్యోగం కోసం దీక్ష చేశాడని ప్రశ్నించారు. ఏ పరీక్ష రాస్తున్నాడని రేవంత్ రెడ్డి దీక్ష చేశాడు? ఏ పరీక్ష రాస్తున్నాడని రాహుల్ గాంధీ అశోక్‌నగర్‌కు వచ్చాడు? అని నిలదీశారు. 'అశోక్‌నగర్‌లో ఉండే సన్నాసులు అని రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారు? మీ రాహుల్ గాంధీ అశోక్‌నగర్ వచ్చిండు.. నువ్వు వచ్చినవ్.. మీ నాయకులు అందరూ ఆ కోచింగ్ సెంటర్ల చుట్టే తిరిగారు.. ఎవరు సన్నాసులు? ఎవరి గురించి మాట్లాడు తున్నావో ఆలోచించుకుంటే బాగుంటుంది.' అని హితవు పలికారు. వచ్చే నాలుగున్నరేళ్లు ఏ ఎన్నికలు లేవని.. ఎన్నికలు లేనప్పుడు రాజకీయ ప్రేరితమైన ఉద్యమాలు, వాళ్లను రెచ్చగొట్టాల్సిన అవసరం లేదని తెలిపారు. మీరిచ్చిన మాట మీరు నిలుపుకోవడం లేదు కాబట్టే నిరుద్యోగులు రోడ్డెక్కుతున్నారని తెలిపారు.

# రంగారెడ్డి జిల్లాకు మహర్దశ



పోటీ పడేలా తీర్చిదిద్దుదామని తెలిపారు. రామోజీ ఫిల్మ్‌సిటీ దేశంలో ఉన్న అన్ని సినిమాలకు ఉపయోగపడుతుందన్నారు. రాచకొండ ప్రాంతం ఒకప్పుడు కంటే అద్భుతంగా కనిపించిందన్నారు. రాచకొండ ప్రాంతాన్ని ఒక అద్భుతమైన ఫిల్మ్ ఇండస్ట్రీగా మారుస్తామని చెప్పుకొచ్చారు. రాబోయే రోజుల్లో రంగారెడ్డి జిల్లాకు మహర్దశ వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.ఫాంహౌస్‌లో ఉన్నవాళ్లు ఔటర్ రింగ్ రోడ్డు ఎవరు తెచ్చారో చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. హైదరాబాద్ నగరానికి మీరేం తెచ్చారని అడిగారు. వాళ్లు హైదరాబాద్‌కు గంజాయి, డ్రగ్స్ తెచ్చారని ఆరోపించారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా మార్చేందుకు అన్ని ప్రణాళికలు చేస్తున్నామని వెల్లడించారు. కాంగ్రెస్ కూలిపోతుందన్న వాళ్లు ఎక్కడున్నారు. వాళ్లు రోజులు లెక్కపెట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అభివృద్ధి కోసం ప్రకాశ్ గౌడ్ లాంటి వాళ్లు మాతో కలిసి వచ్చారన్నారు. పడగొడతామంటే నిలబెడతామని మాతో వచ్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పదేళ్లు పక్కాగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. "రాబోయే రోజుల్లో రంగారెడ్డి జిల్లాకు మహర్దశ రాబోతుంది. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నాం. రీజినల్ రింగ్ రోడ్డు వల్ల రంగారెడ్డి భూములు బంగారం అవుతాయి. హయత్‌నగర్‌కు మెట్రో రాబోతుంది. రామోజీ ఫిల్మ్ సిటీ దేశంలో ఉన్న అన్ని సినిమాలకు ఉపయోగపడుతుంది. రాచకొండ ప్రాంతం అద్భుతమైన ఫిల్మ్ ఇండస్ట్రీగా మారుస్తాం. ఇలాంటివి ఫాంహౌస్‌లో ఉన్నవాళ్లకు ఏం తెలుస్తాయి అన్నారు పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం రాకపోవచ్చు. అందుకే కుల వృత్తులను బలోపేతం చేసుకుంటే బతకవచ్చని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. కులవృత్తులు, చేతివృత్తులు చేసుకునే వారికి పిల్లలను బాగా చదివించండని విజ్ఞప్తి చేశారు. కుల వృత్తికి అంకితం చేయకుండా పిల్లలను బాగా చదివించాలని సూచించారు. కులవృత్తిలో పెరిగే పిల్లలు చట్టాలు చేసే స్థాయికి ఎదగాలన్నారు



## జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంఘ నూతన కమిటీ

జనగామ జూలై 14 (ప్రజామంటలు) : జనగామలోని గబ్బెట గోపాల్ రెడ్డి భవన్, సిపిఐ కార్యాలయం జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఆల్ క్యాడర్స్ సమావేశం జిల్లా అధ్యక్షురాలు జ్యోతి ఆధ్వర్యంలో ఆది వారం నిర్వహించారు. జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ ఔట్సో ర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ 510 జీవోలో 4000 మంది ఉద్యోగులకు అన్యాయం జరిగిందని అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని అన్నారు. అనంతరం నూతన కమిటీ జిల్లా అధ్యక్షురాలుగా జ్యోతి, కార్యదర్శిగా గణేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా పీ. లిఖితరాణీ, వైస్ ప్రెసిడెంట్ భాస్కర్, కోశాధికారి మల్లేశం, జాయింట్ సెక్రెటరీ గా తిరుచ రజిని, ఈసీ మెంబర్ గా సి.హెచ్.అంజయ్య, చీఫ్ అడ్వైజర్ పీ.సౌజన్య, ఈసీ మెంబర్ డాక్టర్ భార్గవి,ఈసీ మెంబర్ కొండ లత, ఈసీ మెంబర్ గా అంజయ్య, లక్ష్మి మీరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు ఏఐటీయూసీ కందిక చెన్నకేశవులు, సాంబయ్య , సి.హెచ్ నిర్మల, సి.హెచ్ , రజిని, లిఖిత, డాక్టర్ భార్గవి, మరి పెల్లి కవిత, రజిని సౌజన్య ,మల్లేశం , లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కాంతి అపరేషన్లు

జనగామ జూలై 14 (ప్రజామంటలు) :

జగిత్యాల పావని కంటి ఆసుపత్రి మరియు ఆపి, రోటరీ క్లబ్ జగిత్యాల వారి ఆధ్వర్యం లో జగిత్యాల నియోజకవర్గ మరియు పరిసర ప్రాంతాలకు చెందిన నిరుపేదలు 15 మంది కి జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేశారు. ఈ కార్యక్రమంలో డా.విజయ్,ఆపి,రోటరీ క్లబ్ సభ్యులు మంచాల కృష్ణ , కొత్త ప్రతాప్ ,కాశి రావు, సాగర్ రావు,ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి మొదటి బోనం

సికింద్రాబాద్, జూలై 14 (ప్రజామంటలు) :

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి వద్ద ఆదివారం బోనాల సందడి నెలకొంది. గత 27 ఏండ్లుగా ఆనవాయితీపరంగా వస్తున్న ఆచారం ప్రకారం అత్తిలి కుటుంబీకులు మొదటి బోనం అమ్మవారికి సమర్పించారు. ఆషాఢ మాసం మొదటి ఆదివారం అమ్మవారి బోనం సమర్పించే ఆనవాయితీ వారి కుటుంబీకులకు ఉందని ప్రతి ఏటా క్రమం తప్పకుండా అంగరంగ వైభవంగా జోగిని శ్యామలతో బోనం ఎక్కించి అమ్మవారికి సమర్పించడం ఎంతో సంతోషదాయకంగా ఉంటుందని మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ పేర్కొన్నారు. కోరిన కోరికలు తీర్చి కొంగుబంగారం చేసే తల్లిగా వెలసిన ఉజ్జయిని మహంకాళి అమ్మవారి కృప కరుణా కటాక్షాలు తెలంగాణ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.





## మున్నూరు కాపు మహాసభ లో జరిగిన వివాహ పరిచయ వేదిక విశేష స్పందన..

**- అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావు**

సికింద్రాబాద్, జూలై 14 ( ప్రజామంటలు) :

తెలంగాణ రాష్ట్ర మునూరు కాపు మహాసభ కాచిగూడలో వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన వచ్చింది. గత 30 సంవత్సరాల నుండి తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ మేడం అంజయ్య హాల్ లో నిర్వహించడం జరుగుతుంది. ఈ వివాహ పరిచయ వేదికలో రెండు వేల మంది పై గా మున్నూరు కాపు కుల సభ్యులు పాల్గొన్నారు. హాజరైన మున్నూరు కాపు కుల బంధువులు అందరికీ భోజనం సదుపాయం కలిపించిన మున్నూరు కాపు మహాసభ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన కుల బంధువులు తమ పిల్లల బయోడేటాతో వివాహ పరిచయ వేదిక లో వివాహ సంబంధాలను సమకూర్చుకున్నారు. ము న్నూరు కాపు కుల బంధువులు మాట్లాడుతూ మాకు ఈ వివాహ పరిచయ వేదిక వలన తమ పిల్లలకు మంచి సంబంధాలు వచ్చాయని ఆనందం వ్యక్తపరిచారు. చిన్న స్థాయి కుటుంబం నుండి విదేశాలలో స్థిరపడ్డ అబ్బాయిలు, అమ్మాయిలు తమ వివాహ సంబంధాలను చూసుకోవడం జరిగిందని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావు జనరల్ సెక్రెటరీ మంగలరపు లక్ష్మణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి లింగిశెట్టి హనుమంతరావు, మ్యారేజ్ బ్యూరో చైర్మన్ గోపాల రాధకృష్ణ, కొండూరు వినోద్ కుమార్, మణికొండ రమేష్, జితేందర్, జోన్నాడా శ్రీకాంత్, మున్నూరు చందు, కొత్త కల్పనా , లాయర్ గాజుల సంగీత, సిరిగిరి పవన్ మాజీ అధ్యక్షులు గంప చంద్రమోహన్, తమెర గణేశ్వర్ పాల్గొన్నారు.



## శేరిలింగంపల్లి ఎస్సీఆర్పీఎస్ అధ్యక్షుడిగా సంతోష్ కుమార్

సికింద్రాబాద్, జూలై 14 (ప్రజామంటల) :

షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం, శేరిలింగంపల్లి, మండల అధ్యక్షునిగా ఎం.సంతోష్ కుమార్ నియమితులయ్యారు. లోయర్ ట్యాంక్ బండ్ లోని అంబేద్కర్ భవన్ లో జరిగిన కార్యక్రమంలో ఏం సంతోష్ కుమార్ ను రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండల అధ్యక్షునిగా నియమిస్తూ తెలంగాణ షెడ్యూల్డ్ కులాల హక్కులపై ఇచ్చిన సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు దొమ్మాటి సుదర్శన్ బాబు నియమిస్తూ, నియామక పత్రాలను సంతోష్ కుమార్ కు అందజేశారు,ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు సుదర్శన్ బాబు మాట్లాడుతూ... సొసైటీ నియమావళి ప్రకారం అనగారిన వర్గాల హక్కుల కోసం పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గంగం శివశంకర్,రాయల్ నర్సింగ్ రావు,దాసరి యాదగిరి,గుంటి విజయ్ బాబు, కుర్మ మహేందర్ తదితరులు పాల్గొన్నారు

# ఆరోగ్య విషయంలో పౌరులకు అవగాహన అనివార్యం

## - లయన్స్ గవర్నర్ వెంకట్ రెడ్డి



జనగామ జూలై 14 (ప్రజామంటలు) :

ఆరోగ్య విషయంలో ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండడం అనివార్యం అని లయన్స్ ఇంటర్నేషనల్ 320ఎఫ్ జిల్లా గవర్నర్ లయన్ వెంకటరెడ్డి అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలో ఆదివారం లయన్స్ క్లబ్ ల ఆధ్వర్యంలో సీనియర్ క్లబ్ అధ్యక్షుడు వై. సంజీవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఉచిత మెగా వైద్య ఆరోగ్య పరీక్షా శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొనీ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ మాట్లాడుతూ జనగామ ప్రాంత లయన్స్ క్లబ్ ల సేవా నిరాతిని అభినందిస్తూ కొనియాడారు. పట్టణంలోని హైదరాబాదు రోడ్డుకు గల ఏకశిలా పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించిన ఈ శిబిరంలో సాధారణ పరీక్షలతో పాటు ఎముకలు, కీళ్లు, కిడ్నీ, ఊపిరితిత్తులు, నరాలు, చిన్న పిల్లల వ్యాధులు, స్త్రీల సంబంధిత వ్యాధులు, గుండె జబ్బులు, నేత్ర సంబంధిత వ్యాధులకు సంబంధించి ఆయా వ్యాధుల ప్రత్యేక వైద్య నిపుణులు 570 మందికి పరీక్షలు నిర్వహించి అవసరార్థులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ముందుగా ప్రతి ఒక్కరికి బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ లు జనగామ, ఆబాద్, మిలీనియం, సూర్య, బి భాయిస్, కింగ్స్ ఐ.ఎం. ఏ., రెడ్ క్రాస్ సొసైటీ ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొనలేకపోయిన జనగామ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర రెడ్డి లయన్స్ క్లబ్ లను అభినందిస్తూ కార్యక్రమం విజయవంతం కావాలని సందేశము పంపారు. గౌరవ అతిథులుగా పాల్గొన్న జనగామ జిల్లా ప్రైవేట్ ఆస్పత్రిల అసోషియేషన్ అధ్యక్షులు డా . లకావత్ లక్ష్మీనారాయణ నాయక్ మాట్లాడుతూ శిబిరంలో పాల్గొని సేవలందించిన యువ వైద్యులను అభినందించారు. పూర్వ జిల్లా గవర్నర్ కన్న పరశు రాములు మాట్లాడుతూ చాలా రోజుల తర్వాత నిర్వహించిన శిబిరంలో పలు రకాల వైద్య నిపుణులు పాల్గొని సేవలందించడం, వారే స్వయంగా మందులు తేవడం లయన్స్ క్లబ్ లకు స్ఫూర్తి అని, గతంలో కూడా ఐ ఎం ఏ, రెడ్ క్రాస్ సంస్థలతో కలిసి పనిచేశామని గుర్తు చేశారు. ఐ ఎం ఏ జనగామ అధ్యక్షుడు డాక్టర్ ఏ. శ్రీనివాసు, కల్నల్ డా. మాచర్ల బిక్షపతి మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండడం గురించి వివరించారు. ఈ శిబిరంలో పాల్గొని వైద్య సహకారం అందించిన వారిలో డా. కల్నల్ మాచర్ల బిక్షపతి, డా. జె బాలాజీ, డా. వి కోటిరెడ్డి, డా. డి లింగమూర్తి, డా. పి. నాగేశ్వర రావు, డా. కె.రంజిత్ కుమార్, డా. యు. ప్రవీణ్ కుమార్, డా. ప్రీతి దయాల్, డా . డి. స్వప్న, డా. యు లక్ష్మి, డా. సిహెచ్ కనకరాజు, డా. రంగు కార్తీక్, డా. పి కృష్ణచైతన్య, డా ఏ శివకుమార్, డా. డి. శివశంకర్, డా. సంతోషి నేరెళ్ళ, డా . చందా కావ్య ఉన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ లు చందుపట్ల రవీందర్ రెడ్డి, కలువల భాస్కర్ రెడ్డి, శిబిరం కోఆర్డినేటర్ లు కదిరే రాజశేఖర్ రెడ్డి, కృష్ణ జీవన్ బజాజ్, శ్రీరామ్ శ్రీనివాస్, పబ్బా చంద్రశేఖర్, జోన్ చైర్మన్ లు పజ్జూరు జయహరి, శ్రీభాష్యాం రఘు తదితరులు పాల్గొన్నారు. లయన్స్ క్లబ్బుల అధ్యక్షులు సంజీవరెడ్డి, డా. పి. నాగేశ్వరరావు, గాదె నర్సింలు, నల్ల యాదగిరి, డా. డి. శివ శంకరరావు, కె రంజిత్ కుమార్, ఏకశిల పబ్లిక్ స్కూల్ ఏ. ఓ. రామకృష్ణ శిబిరం ఏర్పాట్లను పర్యవేక్షించారు. తొలుత లయన్ అల్లాడి ప్రభాకర్ రావు పతాక వందనం పటించారు శిబిరం ఇన్చార్జి డా. రంజిత్ కుమార్ స్వాగతం తెలుపగా చివరన నల్ల యాదగిరి వందన సమర్పణ చేశారు.



# చల్లంగా చుడు పోచమ్మ తల్లి

## గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మొక్కులు

ఇబ్రహీంపట్నం జూలై 14 (ప్రజా మంటలు) :

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామ అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో అదివారం పోచమ్మ తల్లికి 16 కుల సంఘాల సభ్యుల అధ్వర్యంలో అమ్మవారి కి మెక్కులు చెల్లించారు. ఈసందర్భంగా అభివృద్ధి కమిటీ సభ్యులు అమ్మవారి కి పుజాసామగ్రి,చిర సారెలను దప్పు చప్పుల మధ్య,గంగపుత్ర సంఘం అధ్వర్యంలో గోల్లెలా తో పోతరాజు ల విన్యసాల తో వెళ్ళి అమ్మవారి మెక్కులు చెల్లించి వర్షాలు సంవృదిగా కురవలని,పాడిపంటలు సంవృదిగా పండాలని అమ్మవారినీ వేడుకున్నారు. ఈకార్యక్రమంలోగ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎడిపెల్లి గంగారెడ్డి,ఉపధ్యక్షుడు గోడీసెల భుమేష్ గౌడ్,కోశాధికారి పుప్పాల నరేంధర్,రెటర్ రాపర్తి దేవేంధర్ కమిటీ సభ్యులు గా అంకతి రాజన్న,ఎస్కిల శ్రీనివాస్, నూనే సంతోష్,రాధరపు లింగం, గుడ్ల రాజేంధర్,పల్లి పెద్దులు,మెగిలి స్వామి దాస్,తరి రాజ్ కుమార్,పట్నం లక్ష్మణ్,అక్కపెల్లి గోపాల్,గాందారి శ్రీకాంత్, అల్లకుంట లస్మయ్య ,పోతరాజు లు ముఖేష్,సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయ సంస్థ చైర్మన్ ను సన్మానించిన యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్



జమ్మికుంట జులై 14 (ప్రజా మంటలు) :

తెలంగాణ రాష్ట్ర పరిషత్ గ్రంథాలయ శాఖ అధ్యక్షులు డాక్టర్ రియాజ్ సార్ గారిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి వారిని కి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన యూత్ కాంగ్రెస్ హుజరాబాద్ నియోజకవర్గ కార్యనిర్వాహక అధ్యక్షులు సజ్జద్ మహమ్మద్ , మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా డా రియాజ్ అందించిన సేవలను గుర్తించి నేడు అసలు సిసలైన తెలంగాణ రాష్ట్ర గ్రంధాలయాలకి వన్నె తెగలడని కొనియాడారు.





# అశ్వరావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాసు కుటుంబానికి అండగా నిలిచిన 2014 బ్యాచ్ చెందిన ఎస్ఐలు

ఇటీవల ఆత్మహత్య చేసుకున్న వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్క పేట గ్రామానికి చెందిన అశ్వారావుపేట ఎస్సై శ్రీ రాముల శ్రీనివాస్ కుటుంబానికి 2014 బ్యాచ్ ఎస్సై ఏపీ, తెలంగాణ వెల్ఫేర్ సొసైటి అధ్వర్యంలో శ్రీనివాస్ కుటుంబానికి 25 లక్షల రూపాయల చెక్కు నీ అందచేశారు శ్రీనివాస్ సొంత గ్రామానికి చేరుకుని శ్రీనివాస్ చిత్ర పటానికి పులు వేసి మౌనం పాటించి నివాళులు అర్పించారు.2014 కి బ్యాచ్ కి చెందిన ఎస్సై శ్రీనివాస్ అదే బ్యాచ్ కి చెందిన ఎస్సై లు 746 తోటి మిత్రులు డబ్బులు పోగు చేసి శ్రీనివాస్ కుటుంబానికి 2014 బ్యాచ్ ఎస్సై ల వెల్ఫేర్ సొసైటీ కి చెందిన అధ్యక్షులు, కార్యదర్శి మాట్లాడుతూ కుటుంబానికి అండగా ఉంటామని మరియు ఎటువంటి సమస్య ఉన్న 2014 బ్యాచ్ కి చెందిన ఎస్సై లు అందరు తోడు ఉంటామని అన్నారు.ఎవ్వరూ కూడా ఇలాంటి పని చేసుకోవద్దని అని ధైర్యంగా ఉండాలని అన్నారు.మా బ్యాచ్ కి చెందిన ఎస్సై లు అందరం కలిసికట్టుగా డబ్బులు పోగు చేసి శ్రీనివాస్ కొడుకు పేరు మీద 10 లక్షల డిపాజిట్టు కూతురు పేరు మీద 10 లక్షల డిపాజిట్ అమ్మ పేరు మీద 5 లక్షల డిపాజిట్ చేశామని తెలిపారు.ఎస్సై గా ఉంటూ ఈలాంటి పని చేసి ఆత్మ హత్య చేసుకోవడం చాలా బాధ కరం అని అన్నారు. కార్యక్రమం లో 100 మంది వరకు ఎస్సై లు పాల్గొన్నారు.



# పెంబర్తిలో ఘనంగా విశ్వకర్మీయుల ఆషాడమాస వనభోజనాలు

జనగామ జూలై 14 (ప్రజామంటలు ):

జనగామ జిల్లా పెంబర్తి విశ్వకర్మ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆషాడ మాస వనభోజనాల కార్యక్రమం విజయవంతంగా ర్వహించుకున్నారు. విశ్వకర్మ కుటుంబాలు అధిక సంఖ్యలో పాల్గొని పెంబర్తి పెద్ద చెరువు వద్ద సమిష్టిగా వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు.ప్రతీ సంవత్సరం ఆషాడమాసంలో నిర్వహించుకునే వనభోజనాల కార్యక్రమాన్ని ఈరోజు విశ్వకర్మ కుటుంబీకులు సకుటుంబ సమేతంగా పాల్గొని వనదేవతలను పూజించి చెట్ల కింద సామూహిక వనభోజనాలు నిర్వహించుకున్నారు.పిల్లలు పెద్దలు ఆహ్లాదంగా ఆటపాటలతో గడిపారు. విశ్వకర్మ సంఘం నాయకులు అయిలా కీర్తనాచారి మాట్లాడుతూ ఆషాడ మాసంలో ప్రకృతిలో ఏర్పడే ప్రతికూల పరిణామాలనుండి కాపాడమని వనదేవతలను పూజించి ఒకరోజు వనంలో గడిపితే ఆయురారోగ్యాలు కలుగుతాయి అనేటువంటి సాంప్రదాయం ప్రకారంగా ప్రతి సంవత్సరం కూడా ఈ కార్యాక్రమాన్ని నిర్వహించుకుంటున్నాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అయిలా వేదాంతచారి,ప్రధాన కార్యదర్శి అయిలా సోమనరసింహచారి, నాయకులు అయిలా కీర్తనాచారి, తంగళ్ళపల్లి నాగభూషణం, అయిలా కృష్ణమాచారి,రంగు నరసింహచారి, కాలూరి రమేష్,కాలూరి వీరన్న,అయిలా రాము,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# గాంధీలో గుర్తు తెలియని డెడ్ బాడీ

సికింద్రాబాద్, జూలై 14 (ప్రజామంటలు)



గాంధీ ఆసుపత్రిలో మరో గుర్తు తెలియని వ్యక్తి డెడ్ బాడీ వెలుగు చూసింది. చిలకలగూడ ఎస్.ఐ పి.కిషోర్ కథనం ప్రకారం..ఈనెల 13న పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ చేస్తుండగా, గాంధీ ఆసుపత్రి పుట్ పాత్ పై పడి ఉన్న 35%-%40 ఏండ్ల మద్య వయస్సు కలిగిన వ్యక్తి డెడ్ బాడి కనిపించింది. అక్కడ మృతుడికి సంబందించిన ఎలాంటి వివరాలు లభించకపోవడంతో డెడ్ బాడీని గాంధీ మార్చురీకి తరలించి, భద్రపరిచారు. ఫొటోలోని వ్యక్తిని ఎవరైన గుర్తుపట్టినట్లయితే చిలకలగూడ పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని ఎస్.ఐ కోరారు.



రాయికల్ పట్టణంలో పద్మశాలి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆషాడ మాస శ్రీ పోచమ్మ తల్లి బోనాలు జాతర మహొత్సవం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల్ నియోజకవర్గం ఇంచార్జ్ డా. బోగ శ్రావణి



# పేదింట్లో ఉడకనంటున్న కందిపప్పు

ఎల్కతుర్తి. జులై 14 (ప్రజా మంటలు) :

తెలంగాణ రాష్ట్రంలో పప్పుల ధరలు సామాన్య లను కన్నీళ్లు పెట్టిస్తున్నాయి రిటైల్ మార్కెట్లో గతనెల రూ.150-160గా ఉన్న కేజీ కందిపప్పు ఇప్పుడు ఏకంగా రూ.180-200 పలుకు తోంది. సూపర్ మార్కెట్లో రూ.220 వరకు విక్రయిస్తున్నారు. మినప్పప్పు కేజీ రూ. 90-120 ఉండగా ప్రస్తుతం రూ.140-160కి, పెసర పప్పు కేజీ రూ.100 నుంచి రూ.120కి చేరింది. గతేడాది వర్షాభావం వల్ల ఈసారి ఉత్పత్తి 40% తగ్గిందని, అందుకే రేట్లు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.

# తారకరామా నగర్ పోచమ్మ బోనాల జాతరలో పాల్గొన్న డా బోగ శ్రావణి

జగిత్యాల జులై 14 (ప్రజా మంటలు) :

పట్టణంలోని తారక రామ నగర్ లో బోనాల జాతర మహొత్సవంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా. బోగ శ్రావణి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరినీ లోకమాత పోచమ్మ తల్లి చల్లంగా చూడాలని కోరుకున్నట్లు ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మరియు మహిళలు తదితరులు పాల్గొన్నారు






# వనమాలి

నొప్పి..నొప్పి బాబోయ్ నా చేతులు  నొప్పి అని బంటిగాడు కుయ్యో,మొర్రో ఔ%అంటూ ఏడుస్తున్నాడు .చుట్టు ప్రక్కల వాళ్ళంతా పరుగున బంటి గాడి దగ్గరకు చేరుకున్నారు .ఏమైంది అంటూ ఆరా తీయగా భవిష్యత్ లో మీకు రాబోయే అతిపెద్ద ప్రమాదాన్ని తొలగించే ప్రయత్నంలో నా రెండు చేతులు ఇదిగో ఇలా కందిపోయాయి.చూడండీ.. అంటూ రెండు చేతులు చూపించాడు.


అవి బాగా ఎర్రగా కందిపోయి బొబ్బలు వచ్చాయి. అందులో ఒక అవ్వ బంటిని దగ్గరకు తీసుకొని ప్రేమగా తల నిమురుతూ ఏంటి బాబు మనకు రాబోయే ఆ ప్రమాదం? అని అడిగింది. దానికి బంటి  అవ్వ చెయ్యి పట్టుకొని ఎండిపోయిన చెట్లు ,చెరువులు చూపిస్తూ, చూడు అవ్వా! వానలు లేక ఆ మొక్కలు, ఈ చెరువులు  ఎలా ఎండిపోయాయో.

నీళ్ళు లేక ఈ  చెరువులు ఎండిపోతే మనకు తాగడానికి నీరు ఎక్కడనుండి వస్తుంది ?మన పరిస్థితి ఏమిటి ?అని అన్నాడు .జవాబు లేని ఆ ప్రశ్నకు ఆ అవ్వ ఏమీ సమాధానం చెప్పలేక మౌనంగా బంటి కళ్ళలోకి చూస్తూ వాడు  చెప్పేది వింటూ ఉంది.

నిన్న మా బడిలో  పంతులు గారు పర్యావరణ పరిరక్షణ అనే పాఠం చెబుతూ ప్రతీ ఒక్కరూ  మొక్కలు నాటి,ప్రకృతిని కాపాడే  విషయంలో బాధ్యతగా  ఉండాలని, చెట్లను విచక్షణా రహితంగా కొట్టి వేస్తే  మనుషులే కాక సకల జీవకోటికి నీరు, ఆహారం దొరకదని చెప్పారు. ఇంట్లో తాగడానికి నీరు కొంటున్నాము, భవిష్యత్తులో ఆక్సిజన్ కూడా కొనుక్కోవలసిన పరిస్థితి ఏర్పడుతుందని ,నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పేదవారు ఆకలితో ఇప్పటికే అల్లాడిపోతున్నారని చెప్పారు . మొక్కలు నాటడం ప్రతి ఒక్కరు విధిగా చేయాలన్నారు .మొక్కలు నాటడం వలన మానవాళికే కాక పశు,పక్ష్యాదులకు కూడా ఆహారం, నీరు, ఆవాసం దొరుకుతుందన్నారు.మొక్కలలోని ఔషధ  గుణాల గురించి చెప్పారు .మొక్కలు నాటడం అంటే  ఇతరులకు సహాయ పడటం లాంటిదేనని , దానిలోనే నిజమైన ఆనందం ఉందని చెప్పారు.మొక్కలతో స్నేహం చేయాలన్నారు.ప్రతి ఒక్కరూ ఒక్కొక్క మొక్క నాటుతామని మా అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు.అందుకే నేను ఇంకా నాస్నేహితులం మొక్కలు నాటాలని నిర్ణయించుకున్నాము.

అందుకే మన పరిసరాలలో నా వంతుగా మొక్కలు నాటుతున్నాను. నేల గట్టిగా ఉండుట వలన మట్టి తవ్వి నా చేతులు నొప్పెడుతున్నాయి అన్నాడు.

అప్పుడు  అవ్వ బంటిని గట్టిగా హత్తుకొని, మా రోజులలో ప్రతి ఇంటికి ఒక  చెట్టు  ఉండేది. సాయంత్రం అయ్యేసరికి అందరం  ఆ చెట్టు కింద కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ  ఆ చెట్టు నుండి  వచ్చే గాలితో హాయిగా సేద తీరి, చాలా ఆరోగ్యంగా ఉండేవాళ్ళం. కానీ మనం ఇప్పుడు ప్రకృతిని వెలివేస్తూ భావితరాల భవిష్యత్తును బలి పెడుతున్నాం



.చేజేతులా జీవం పోసే మొక్కలను కొట్టి ఇప్పుడు ఆరోగ్యం కోసం ఆరాట పడుతున్నాం.చిన్నపిల్లలు దేవుడితో సమానం అనే మాట నిజం చేస్తూ నువ్వు చాలా మంచి పని చేస్తున్నావు . నేను కూడా  నాకు చేతనైనంత వరకు నువ్వునాటిన చెట్లకు నీళ్ళు పోస్తూ వాటికి  రక్షగా ఉంటాను. అక్కడున్నవారితో  చిన్నవాడైనా వీడు  చాలా గొప్ప పని చేస్తున్నాడు .మనందరం కూడా  బంటి తో కలిసి మొక్కలు నాటుదాం,మన ప్రకృతిని సంరక్షించుకుందాం అని అంది అవ్వ.

కలసిమెలసి పనిచేయటంలోని ఆనందాన్ని ఆస్వాదిస్తూ అందరూ ఉత్సాహంగా మొక్కలు నాటారు . చిన్న వయసులోనే ఇంత సామాజిక బాధ్యత ఉన్న బంటీని అందరూ చుట్టూ  చేరి అభినందించారు.బంటి చాలా సంతోషంతో తను నాటిన మొక్క దగ్గర కూర్చొని దాని వైపు చూశాడు . అది కృతజ్ఞతాపూర్వకంగా ఆకులు ఊపుతూ  బంటి ముఖాన్ని ప్రేమగా తాకింది.

ధూళిపాళ్ల మాధవి కిషోర్
గుంటూరు , 9949735253

## వ్యాసకర్తలకు వినతి

**రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై వ్యాసాలు పంపేవారు మీ వ్యాసాలను వీలైనత క్లుప్తంగా, వివరణాత్మకంగా, 350-400 ల పదాలకు పరిమితం అయి ఉండేలా చూడండి.  పెద్ద వ్యాసాలను పరిశీలించనడం సాధ్యం కాకపోవచ్చని గ్రహించగలరు. వర్డ్ డాక్యుమెంట్, లేదా ఓపెన్ ఫైల్ లో, ఈ మెయిల్ కు మాత్రమే పంపగలరు.**

**mantalukathalu@gmail.com**

-ఎడిటర్



## జగిత్యాలలో వైభవంగా బోనాల సందడి..

జగిత్యాల జులై 14 (ప్రజా మంటలు) :
జగిత్యాల కేంద్రంలోని సాయిరాం నగర్ కాలనీ వాసులు ఆదివారం రోజున అంగరంగవైభవంగా ఆషాడ మాసం పోచమ్మ తల్లి బోనాలు నిర్వహించారు. మహిళలు, పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మల్లారెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, కందుకూరి నాగరాజు, బోనగిరి దేవయ్య, శోభ, జ్యోతి, సంధ్య, వర తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ను సన్మానించిన ఆల్ బీసీ మైనారిటీ నాయకులు

- హైదరాబాద్ అఫ్జల్ గంజ్ సెంట్రల్ లైబ్రరీలో ప్రమాణ స్వీకారం..
- చైర్మన్ డాక్టర్ రియాజ్ ను సన్మానించిన ఆల్ బీసీ మైనారిటీ జాతీయ నాయకులు



జమ్మికుంట జులై 14 (ప్రజా మంటలు) :
హైదరాబాద్ అఫ్జల్ గంజ్ లోని సెంట్రల్ లైబ్రరీలో తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా నియామకమైన డాక్టర్ రియాజ్ ఆదివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి వివిధ సంఘాల నాయకులు, రియాజ్ సార్ అభిమానులు కార్యక్రమంలో పాల్గొని శాలువాలు పుష్పమిత్రాలతో సన్మానించారు. దీనిలో భాగంగా ఆల్ బీసీ మైనారిటీ జాతీయ అధ్యక్షులు మహమ్మద్ శుకురోద్దీన్, జాతీయ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అంకూస్,  జాతీయ కోశాధికారి ఖజామియా, జాతీయ కార్యదర్శి  మహమ్మద్ నసీరోద్దీన్ లు పాల్గొని చైర్మన్ గారికి పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో సన్మానించారు. రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా లైబ్రరీల అభివృద్ధికి, గ్రామస్థాయిలో లైబ్రరీలో ఏర్పాటుకు కృషి చేయాలని ఈ సందర్భంగా చైర్మన్ ను కోరారు. దీనికి రాష్ట్ర గ్రంధాలయ సంస్థ చైర్మన్ సానుకూలంగా స్పందించారు.



## ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ను కలిసిన మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇంగిలే రామారావు

జమ్మికుంట జులై 14 (ప్రజా మంటలు) :
ఈరోజు హైదరాబాదులో తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన ఐత ప్రకాష్ రెడ్డి గారిని ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇంగిలే రామారావు వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫిషర్మెన్ చైర్మన్ బండి మల్లేష్ హుజురాబాద్ నియోజకవర్గ నాయకులు ఎండి సలీం తదితరులు పాల్గొన్నారు.

## కవిత్వం

### నిస్సాహాయత

ఏమి చేయలేని
స్థితిలో ఉన్న
ఎందుకో ?

చలించని
మనసుదా!
సహాయం చెయ్యని
చేతిదా!

బతుకు పోరులో
నిత్యం
అటు పోటులే
భరిస్తున్నా

జీవన ప్రయాణంలో
బతుకు తెరువు కోసం
బాధ్యత తో
పరితపిస్తున్న

రచనజి
చాపలమహేందర్
మాణిక్యపురం
జనగామ జిల్లా
9949864152

## పాలిట్రిక్స్

ప్రతిపక్షాల జోరు చూస్తే
పెద్దపీట ఖాయం,
రాజకీయ లెక్కల్లో
అదేనంట న్యాయం !

అక్రమ పరిపాలనమని
కలవరిస్తే సరిపోదు,
కార్యాచరణకు తెరలేపితే
బీటలు వారక తప్పదు !

-న్యాలకంటి నారాయణ
9346200066

## పిల్లలకు ఉచిత వైద్య శిబిరం

గొల్లపల్లి జులై 14 (ప్రజా మంటలు) :  గొల్లపల్లి మండలం లోని లక్ష్మీపూర్ గ్రామంలో ఆదివారం శ్రీ అక్షర హాస్పటల్ డాక్టర్ పూర్ణచందర్ రావు ఉచిత వైద్య శిబిరం నిర్వహిం చారు. పిల్లలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అంద౹జేశారు. ఇట్టి కార్యక్రమానికి బాధినేని మల్లారెడ్డి ఉచిత వ్యాన్ సౌకర్యం కలిపించారు. పల్లెలలో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న తరుణంలో అక్షర హాస్పటల్ నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం గ్రామస్తులకు ఎంతో ఉపయోగపడుతుంది అని మాజీ ఎంపీటీసీ సభ్యులు గోవిం దుల లావణ్య-జలపతి హాస్పటల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు ఇట్టి కార్యక్రమంలో  మాజీ సర్పంచ్ దావు సత్తయ్య-మల్లక్క,చందు,లక్ష్మీపతి, బాధినేని మల్లారెడ్డి,గ్రామస్తులు పాల్గొన్నారు



## ముల్కనూర్ గ్రామంలో ఇంటింటా భగవద్గీత ప్రచారం

భీమదేవరపల్లి జులై 14
(ప్రజా మంటలు) :





భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో త్రైత సిద్ధాంతం ప్రబోధా సేవ సమితి ఇందు జ్ఞాన వేదిక హుజురాబాద్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం జరిగింది భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగము అధ్యాయం నందు 16వ శ్లోకం లో క్షర పురుషుడు అని జీవాత్మ గురించి అక్షర పురుషుడు అని ఆత్మ గురించి 17వ శ్లోకంలో పురుషోత్తముడు అని పరమాత్మ గురించి చెప్పారు అంటే జీవాత్మ  ఆత్మ పరమాత్మ అనే మూడు ఆత్మలు ఆధ్యాత్మికములో ముఖ్యమైనవి అని అర్థం దీని ఆధారంగానే త్రైత సిద్ధాంత భగవద్గీతను గురువుగారు శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామి వారు రాశారు ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదన చేసి శాస్త్ర బద్దతతో కూడిన జ్ఞాన%శీ%ను అందించారు మధ్యాత్మ ఆరాధనతో ధర్మముల స్థాపన జరుగుతుంది అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ఇందు జ్ఞాన వేదిక ప్రబోధా సేవ సమితి హుజురాబాద్ కమిటీ అధ్యక్షులు బాణాల రవీందర్ రెడ్డి సభ్యులు సతీష్ చారి రమేష్ చారి వంశీకృష్ణ రామస్వామి రాహుల్ సిద్ధార్థ అభిరామ్ జ్యోతి చంద్రమ్మ సరిత పద్మ శకుంతల రాధిక హిమబిందు అశ్రిత దైవ జ్ఞాన ప్రచారంలో పాల్గొన్నారు.

## తమ వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యేకు వీఆర్ఏలు వినతి

జగిత్యాల జులై 14 (ప్రజా మంటలు) : ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ని కలిసి తమ వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని  వి ఆర్ ఎలు వినతి పత్రాన్ని అందజేసారు. తెలంగాణ రాష్ట్రంలో దశాబ్దాల కాలంగా విధులు నిర్వర్తిస్తున్న 61 ఏళ్లు పైబడిన 3797 మంది వీఆర్ఏలకు పదవీ విరమణ వయస్సు నిర్ధారణ కాలేదని,వారి స్థానంలో దశాబ్ద కాలంగా విధులు నిర్వర్తిస్తున్న వారి వారసులకు వారి విద్యా అర్హతను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని రెగ్యులర్ స్కేల్ వర్తింపజేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వీఆర్ఏల సమస్యలు ముఖ్యమంత్రి మరియు రెవెన్యూ మంత్రి  దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని అవసరమైతే మంత్రి వద్దకు వీఆర్ఏలను తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TEL-TEL01938. FILE NO.1349985 PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com